నమస్తే తెలంగాణ
కరీంనగర్
5 | కరీంనగర్, శుక్రవారం 22 డిసెంబర్ 2023 | KARIMNAGAR

• 'మానేరు'పై మంచు దుప్పటి



కరీంనగర్ శివారులోని మానేరు డ్యాంపై మంచుదుప్పటి పరుచుకున్నది. గురువారం తెల్లవారుజామున రిజర్వాయర్ పరిసర ప్రాంతాల్లో దట్టమైన పొంగమంచు కమ్ముకున్నది. దీంతో వాహనదారులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. భానుడి కిరణాలు పడకపోవడంతో మసక చీకట్లో వెహికిళ్లకు లైట్లను వేసుకొని వెళ్లారు. - స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కరీంనగర్

• అసెంబ్లీలో ఎమ్మెల్యే కౌశిక్ జన్మదిన వేడుకలు

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డికి కేక్ తినిపిస్తున్న మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, మల్లారెడ్డి తదితరులు

హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి జన్మదిన వేడుకలను రాష్ట్ర అసెంబ్లీ ప్రాంగణంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కౌశిక్‌రెడ్డి కేక్ కట్ చేయగా. మాజీ మంత్రులు, ప్రస్తుత ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీశ్‌రావు, మల్లారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ఆయనకు కేక్ తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. అంతకు ముందు ఉదయం బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. -హుజూరాబాద్‌టౌన్, డిసెంబర్ 21

వైద్యరంగం కోసం రూ.వందల కోట్లు

ఉమ్మడి జిల్లాలో వైద్య ఆరోగ్యరంగాన్ని మెరుగు పరిచేందుకు వందలాది కోట్లు వెచ్చించింది. 2014కు ముందు 'నేను రాను బిడ్డో సర్కారు దవాఖాన'కు అనే పరిస్థితిని కేసీఆర్ సర్కారు పూర్తిగా మార్చివేసింది. వైద్య రంగాన్ని బలోపేతం చేయడంతో ప్రతి ఒక్కరూ ప్రభుత్వ దవాఖానలకే క్యూ కట్టాల్సిన పరిస్థితి వచ్చింది. ఉమ్మడి జిల్లాలో 2016లో కేవలం 77 పీహెచ్‌సీలు ఉంటే, వాటిని 93కు పెంచింది. ఆ దవాఖానల్లో 1,342 బెడ్స్ మాత్రమే ఉంటే, వాటిని 2,850కి పెంచింది. సిబ్బంది సంఖ్యను 3,149 నుంచి 4,318కి పెంచింది. అలాగే కేసీఆర్ ప్రభుత్వం జిల్లాకో మెడికల్ కాలేజీ ఇచ్చింది. ఈ కళాశాలల్లో ప్రతి విద్యా సంవత్సరంలో 500 మెడికల్ సీట్లు అందుబాటులోకి వచ్చాయి. ఓపీ గణనీయంగా పెరిగింది. 2014కు ముందు 2,400 మందికి మాత్రమే ప్రతి రోజూ ఓపీ చూడగా, ఆ సంఖ్య 5,600కు పైగా కేసీఆర్ ప్రభుత్వంలో పెరిగింది. మాతా శిశు ఆరోగ్య కేంద్రాల ఏర్పాటుతో ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాల సంఖ్య ఊహించని రీతిలో పెరిగింది. 2016కు ముందు రోజుకు కేవలం 24 ప్రసవాలు జరిగితే, ప్రస్తుతం 129 జరుగుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో 326 పల్లె, 19 బస్తీ దవాఖానలు, 16 మహిళా ఆరోగ్య కేంద్రాలను కేసీఆర్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

గత జూలై వరకు ఆయా జిల్లాల వారీగా ఇచ్చిన కేసీఆర్ కిట్స్ వివరాలు

జిల్లా	లబ్ధిదారుల సంఖ్య	వెచ్చించిన మొత్తం (రూ.కోట్లలో)
కరీంనగర్	53,134	38.45
జగిత్యాల	36,514	35.05
పెద్దపల్లి	24,324	25.55
సిరిసిల్ల	17,163	19.76

పెరిగిన బెడ్స్ సదుపాయాలు

జిలా	2016కు ముందు	ప్రస్తుతం	పెరిగినవి
కరీంనగర్	660	1,038	378
జగిత్యాల	352	642	290
పెద్దపల్లి	140	780	640
సిరిసిల్ల	190	390	200

విద్యుత్ విజయం

ఉమ్మడి రాష్ట్రంలో వ్యవసాయ రంగానికి 6 గంటల కరెంటు ఇస్తే, కేసీఆర్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ముందుగా 7గంటలకు, తర్వాత 9 గంటలు ఇచ్చింది. 2018 జనవరి ఒకటి నుంచి నిరంతర విద్యుత్తు సరఫరా చేస్తున్నది. అందుకోసం ₹650 కోట్లతో మౌలిక సదుపాయాలు కల్పించారు. 2014కు ముందు ఉన్న కనెక్షన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, ఇతర విషయాలను పరిశీలిస్తే, విద్యుత్ రంగంపై కేసీఆర్ ప్రభుత్వం ఒక్క ఉమ్మడి జిల్లాలోనే ఎంత ఖర్చు పెట్టిందో అర్థమవుతుంది. 2014లో ఉమ్మడి జిల్లాలో కేవలం 218 విద్యుత్తు ఉప కేంద్రాలు ఉంటే, కేసీఆర్ సర్కారు వాటి సంఖ్యను 351 కేంద్రాలకు పెంచింది. అలాగే పదేళ్లలో 149 కొత్త విద్యుత్తు ఉప కేంద్రాలను ఏర్పాటు చేసింది ట్రాన్స్‌ఫార్మర్లు చూస్తే 2014లో కేవలం 53,247 మాత్రమే ఉండగా, అవి 78,958 పెరిగాయి. పదేళ్లలో 25,711 ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసింది.

ట్రాన్స్‌ఫార్మర్లు

జిల్లా	2014	ప్రస్తుతం	ప్రగతి
కరీంనగర్	19,962	28,129	8,167
జగిత్యాల	15,841	24,032	8,191
పెద్దపల్లి	11,522	16,656	5,134
సిరిసిల్ల	5,922	10,141	4,219



అప్పులు కాదు.. ప్రతీది పెట్టుబడే

ప్రగతి అంటే.. అది ప్రజల ఆస్తి

- కేసీఆర్ సర్కారు హయాంలో ఉమ్మడి జిల్లాలో వేలాది కోట్లతో అభివృద్ధి
- రైతన్నను ఆదుకునేందుకు అనేక కార్యక్రమాలు
- కోట్లాది నిధులతో విద్యుత్ రంగం బలోపేతం
- ప్రాజెక్టుల నిర్మాణంతో తీరిన సాగునీటి కష్టాలు
- విద్య, వైద్య రంగంలోనూ విప్లవాత్మక మార్పులు

'అభివృద్ధి కావాలంటే నిధులు వెచ్చించాలి. రంగం ఏదైనా సరే లాభదాయకంగా మారాలన్నా.. దానిని నమ్ముకున్న వ్యక్తుల జీవితాల్లో వెలుగులు నిండాలన్నా కొంత ఇన్వెస్ట్ చేయాలి. ఒక కొడుకును విద్యావంతుడిని చేయాలంటే అతని చదువుకు కొంత ఇన్‌వెస్ట్ చేయాలి. తాను లాభపడుతూ, వేలాది మందికి ఉపాధి చూపాలంటే ఒక కంపెనీ పెట్టాలి. భూములు కొని లాభాలు చూడాలన్నా.. ఇలా ఏ రంగమైనా సరే ముందుగా పెట్టుబడి పెట్టాలి. ఆ తర్వాత దాని ద్వారా వచ్చే లాభాలు పొందాలి. ఇది చిన్న బేసిక్ సూత్రం. సగటు మనిషి ఆలోచన ఇలాగే ఉంటుంది. కేసీఆర్ సర్కారు సైతం ఇలాగే కోట్లాది నిధులతో ప్రతి రంగాన్ని అభివృద్ధి చేసింది. విద్య, వైద్యాన్ని బలోపేతం చేసింది. విద్యుత్ రంగాన్ని సంస్కరించి నాణ్యమైన కరెంట్ అందించింది. అనేక ప్రాజెక్టులు నిర్మించి జలగోసను తీర్చి, భావితరాలకు తరగని ఆస్తిని సృష్టిస్తే, కొన్ని అధికార పార్టీలు కండ్లుమండించుకుంటున్నాయి. ఆయా రంగాల్లో జరిగిన అభివృద్ధిని చెప్పకుండా వ్యయాన్ని అప్పుగా చూపిస్తూ, జరుగుతున్న లాభాన్ని దాచిపెడుతూ కేసీఆర్ సర్కారును అభాసుపాలుచేస్తున్నాయి. ప్రగతిని తొక్కిపెడుతూ పెట్టుబడిని అప్ప అని ముద్రతో బద్నాం చేసేందుకు యత్నిస్తూ పైశాచిక ఆనందాన్ని పొందుతుండగా, సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

జిల్లాల వారీగా మిషన్ భగీరథ కింద అంచనా వ్యయం.. ఇప్పటివరకు అయిన ఖర్చు వివరాలు

జిల్లా	అంచనా వ్యయం (రూ.కోట్లలో)	చేసిన ఖర్చు (రూ.కోట్లలో)
రాజన్న సిరిసిల్ల	1275.83	971.49
జగిత్యాల	1622.86	1484.32
పెద్దపల్లి	249.70	173.92
కరీంనగర్	190.72	172.74

కరీంనగర్, డిసెంబర్ 21 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): రంగం ఏదైనా సరే, అభివృద్ధి జరగాలంటే తప్పకుండా పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. ఒక కొడుకును విద్యావంతుడిని చేయాలంటే అతనిపై పెట్టుబడి పెట్టాలి. అలాగే ఒక ఇల్లు నిర్మించుకోవాలన్నా, ఒక కంపెనీ లేదా కొత్త ఆఫీసు పెట్టాలన్నా, భూములు కొనాలన్నా.. ఇలా రంగం ఏదైనా సరే ముందుగా పెట్టుబడి పెట్టి, దాని ద్వారా వచ్చే ఫలాలను తిరిగి పొందాల్సి ఉంటుంది. కేసీఆర్ ప్రభుత్వం కూడా అదే చేసింది. ప్రజల కోసం వివిధ రంగాలపై వేలాది కోట్లు వెచ్చించి, అభివృద్ధిని ముందుకు నడిపింది. ఫలితంగా ఆ ఫలాలు ఇప్పుడు కనిపిస్తున్నాయి. 2014కు ముందు ఉమ్మడి జిల్లాలో చూస్తే.. కేవలం 3.83 లక్షల ఎకరాల్లో మాత్రమే వరి సాగయ్యేది. ప్రస్తుతం ఆ విస్తీర్ణం 12.35 లక్షలకు పెరిగింది. ఆనాడు ఉమ్మడి జిల్లాలో 13.97 లక్షల మెట్రిక్‌ధాన్యం ఉత్పత్తికాగా, ఇప్పుడు 28.60 లక్షల మెట్రిక్ టన్నులకు చేరింది. గతంలో కరెంటు, సాగునీరు లేక కేవలం 4.57 లక్షల మంది రైతులు సాగు చేస్తే.. ఇప్పుడు ఆ సంఖ్య 9,25,343 మందికి చేరింది. అలాగే రైతుబంధు కింద 11 విడుతల్లో ₹7,750.68 కోట్ల పెట్టుబడి సాయం అందించింది. ఇవన్నీ చూస్తే, కేసీఆర్ సర్కారు ఎంత పెట్టుబడి పెట్టి ప్రోత్సహించిందో అర్థమవుతుంది. ఒక్క వ్యవసాయ రంగమే కాదు, అన్ని రంగాల్లోనూ ప్రగతి కనిపిస్తున్నది. విద్య, వైద్యం రంగాల్లో మార్పులు తేవడంతోపాటు మిషన్‌కాకతీయ, ప్రాజెక్టుల నిర్మాణం, కమిషనరేట్ల ఏర్పాటు, పెరిగిన మున్సిపాలిటీలు, సమీకృత కలెక్టరేట్లు, జిల్లాకో మెడికల్ కాలేజీ, ప్రసవాలను పెంచేందుకు కేసీఆర్ కిట్, కులవృత్తులకు జీవం పోసేందుకు గొర్రెల పంపిణీ, దళిత బంధు ఇలాంటివి వాటిపై ప్రభుత్వం పెట్టుబడి పెట్టింది. కానీ ప్రతిపక్షాలు జరిగిన అభివృద్ధిని పట్టించుకోకుండా వాటిని అప్పులుగా చూపించి, వాటి ద్వారా వస్తున్న ఫలాలను దాచిపెట్టి ప్రజల ముందు కేసీఆర్ సర్కారును అబాసుపాలు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో మచ్చుకు కొన్ని రంగాలకు సంబంధించి జరిగిన అభివృద్ధి పెట్టిన ఖర్చులను చూస్తే వాస్తవాలు ఎలా ఉంటాయో..? అర్థమవుతుంది.

వెల్లువలా పరిశ్రమలు

ఉమ్మడి జిల్లాలో 2014 వరకు 588 పరిశ్రమలు ఉండగా, ₹192 కోట్ల పెట్టుబడి ఉంది. వీటిలో 2,603 మందికి ఉద్యోగావకాశాలు కల్పించినట్లు ఆనాటి గణాంకాలు చెబుతున్నాయి. కానీ, గడిచిన ప్రభుత్వంలో చూస్తే పూర్వ జిల్లాలో కొత్తగా 4,764 పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. ₹19,085 కోట్ల పెట్టుబడులు రాగా, 34,964 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి దొరుకుతున్నది. ఇవేకాదు 2014 వరకు ఉమ్మడి జిల్లాలో రా రైస్, బాయిల్డ్ రైస్ కలిపి 542 రైస్‌మిల్లులు ఉండగా, ప్రస్తుతం ఆ సంఖ్య 805కు చేరింది. వరి విస్తీర్ణం భారీగా పెరగడంతో రైస్ మిల్లుల సంఖ్య భవిష్యత్‌లో ఇంకా పెరిగే అవకాశమున్నది.

వైకుంఠ ధామాలపై వెచ్చించిన మొత్తం వివరాలు

జగిత్యాల	: ₹34.20 కోట్లు
పెద్దపల్లి	: ₹12.97 కోట్లు
సిరిసిల్ల	: ₹30.60కోట్లు
కరీంనగర్	: ₹39.25కోట్లు
మొత్తం	: ₹141.77కోట్లు

మిషన్ కాకతీయతో చెరువులకు జీవం

ఉమ్మడి జిల్లాలో మొత్తం చెరువులు 4,283 ఉండగా, వీటి పరిధిలో 15.73 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం ఉండేది. నాడు చెరువులు పరిస్థితి అధ్వానంగా ఉండడంతో కేవలం 4.89 టీఎంసీల నీరు మాత్రమే అక్కడక్కడా చెరువుల్లో నిలిచి ఉండేది. మొత్తం చెరువుల కింద 2లక్షలకుపైగా ఆయకట్టు ఉన్నా 1.27 లక్షల ఎకరాలకు మాత్రమే, అదీ ఒక పంటకే నీరందేది. కేసీఆర్ సర్కారు చెరువులకు జీవం పోసేందుకు మిషన్ కాకతీయను తెచ్చింది. దీని కింద ₹741.18 కోట్లతో 1,833 చెరువులను పునరుద్ధరించింది. దీంతో నీటి నిల్వ సామర్థ్యం 19.93 టీఎంసీలకు చేరింది.

2014 నాటికి చెరువుల కింద ఉన్న ఆయకట్టు.. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో పెరిగిన ఆయకట్టు వివరాలు

జిల్లా	2014లో	ప్రస్తుతం	ప్రగతి
కరీంనగర్	47,875.3	76,655	28,779
జగిత్యాల	10,000	25,000	15,000
పెద్దపల్లి	45,617	53,087	7,470
సిరిసిల్ల	23,608	43,846	20,238

పంట పెట్టుబడికి 11 విడుతలుగా సాయం

ప్రతి సీజన్‌లో రైతులు ఎదుర్కొంటున్న పెట్టుబడి కష్టాలు తీర్చేందుకు కేసీఆర్ సర్కారు రైతుబంధును తెచ్చింది. 2018 మే 10న కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ నియోజకవర్గంలో ప్రారంభించింది. ఇప్పటి వరకు 11 విడుతలుగా సాయం అందించింది. 12వ విడుత టైంలో ఎన్నికలు రావడంతో ఆగిపోయింది. పూర్వ కరీంనగర్ జిల్లాలో ప్రభుత్వ అధికారిక లెక్కల ప్రకారం చూస్తే 13 అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం 9,25,343 మంది రైతులకు 11 విడుతల్లో ₹7,750.68 కోట్ల చిలుకు మొత్తాన్ని పెట్టుబడి కింద అందించింది.

2014 వరకు ఆసరా పింఛన్లు.. కేసీఆర్ ప్రభుత్వం పెంచిన ఫించన్లు

	పెద్దపల్లి	కరీంనగర్	జగిత్యాల	రాజన్న సిరిసిల్ల
జిల్లాలో 2014కు ముందు ఉన్న పింఛన్లు	: 61,953	1,09,693	1,00.877	56, 116
అప్పుడు నెలకు చెల్లించిన మొత్తం	: ₹1.23కోట్లు	₹8.72కోటు	₹2.06కోటు	₹1.12 కోట్లు
ప్రస్తుతం ఆసరా లబ్ధిదారుల సంఖ్య	: 97, 752	1,41,344	2,28,351	1,21,142
ప్రతినెలా పింఛన్ల కోసం ఇస్తున్న మొత్తం :	₹21కోట్లు	₹30.86కోట్లు	₹47.77కోట్లు	₹25.75కోట్లు

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★రామకృష్ణ గ్రూపు (A.P, న్యూఢిల్లీ No.1)
శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు ఇంటి/వంటపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు 12/24 గం.ల డ్యూటీ కొరకు కావలెను. ఏజెంట్లకు 5వేలు కమీషన్. 9281452762, 9515108830.
NT-314474

చేరువైన పాలన

2016 అక్టోబర్ 11న జిల్లాల పునర్విభజన జరిగింది. 40 లక్షల జనాభా, 57 మండలాలతో అతిపెద్ద జిల్లాగా ఉన్న కరీంనగర్ ఉమ్మడి జిల్లా నాలుగు చిన్న జిల్లాలుగా అవతరించింది. అప్పుడు ఉమ్మడి జిల్లాలో 46 మండలాలు మాత్రమే మిగిలాయి. అయితే, పలు గ్రామాల ప్రజలకు మండల కేంద్రాలు సైతం దూరంగా ఉన్నాయని భావించిన కేసీఆర్ ప్రభుత్వం, కొత్తగా 17 మండలాలను ఏర్పాటు చేసింది. కొత్త జిల్లాల ఏర్పాటుకు ముందు 5 రెవెన్యూ డివిజన్లు ఉండగా, కొత్తగా మరో 4 రెవెన్యూ డివిజన్లు ఏర్పాటయ్యాయి. ఉమ్మడి జిల్లాలో ఒకప్పుడు 8 మున్సిపాలిటీలు ఉండగా, కొత్తగా మరో 8 మేజర్ గ్రామ పంచాయతీలు మున్సిపాలిటీలుగా అప్‌గ్రేడ్ అయ్యాయి.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

కరోనాపై అలర్ట్

- అప్రమత్తమైన వైద్య ఆరోగ్యశాఖ
- రాజన్నసిరిసిల్ల దవాఖానలో పది బెడ్లతో ఐసోలేషన్ సెంటర్
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు

రాజన్న సిరిసిల్ల జిల్లా ఏరియా దవాఖానలో కొవిడ్ బాధితుల కోసం ఏర్పాటు చేసిన ఐసోలేషన్ సెంటర్

రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 21 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర రాజధానిలో మళ్లీ కరోనా కేసులు వెలుగు చూస్తుండడంతో జిల్లా వైద్యారోగ్యశాఖ అలర్ట్ అయింది. కొత్త వేరియంట్ జేఎన్-1 వ్యాప్తి నేపథ్యంలో పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఏరియా దవాఖానల్లోని సిబ్బందిని అప్రమత్తం చేసింది. గురువారం రాజన్నసిరిసిల్ల జిల్లా వైద్యశాల, వేములవాడ ఏరియా హాస్పిటల్‌లో పది బెడ్లతో ఐసోలేషన్ సెంటర్లను ఏర్పాటు చేసింది. ఇందులో ఆక్సిజన్, ఐసీయూ సౌకర్యాలు కల్పించింది. జిల్లా దవాఖానలో 80 మంది వైద్యులు ఉండగా ఇందులోని 10 మంది వైద్యులను కొవిడ్ చికిత్స కోసం కేటాయించారు. దవాఖానకు వచ్చే రోగుల కోసం శానిటైజర్ బాటిళ్లను ఏర్పాటు చేశారు. కావాల్సిన మందులను అందుబాటులో ఉంచారు. మరోవైపు ప్రజలకు అవగాహన కల్పించేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నది. ప్రతిఒక్కరూ మాస్కులు ధరించి భౌతిక దూరం పాటించాలని సూచిస్తున్నది. 2020, 21 సంవత్సరాల్లో కొవిడ్ అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ప్రస్తుతం చేపట్టాల్సిన చర్యలపై వైద్యసిబ్బందికి సూచనలిస్తున్నారు. 24 గంటల పాటు అందుబాటులో ఉండాలని నిర్దేశిస్తున్నారు.

వైద్యశాలల్లో వసతుల కల్పన..

కొవిడ్ కట్టడికి వైద్యారోగ్యశాఖ అధికారులు పకడ్బందీ చర్యలు చేపడుతున్నారు. ముఖ్యంగా గ్రామీణులకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు దవాఖానల సంఖ్య, అందులోని బెడ్లు, ఆక్సిజన్, వెంటిలేటర్లు, ఉన్న సౌకర్యాల వివరాలతో నివేదికలు సిద్ధం చేస్తున్నారు. వైద్యశాలలకు వచ్చే రోగులకున్న వ్యాధుల లక్షణాలను బట్టి కొవిడ్ పరీక్షలు చేసేందుకు ప్రత్యేక సిబ్బందిని నియమించారు. పాజిటివ్ బాధితులను దవాఖానలకు తరలించేందుకు అంబులెన్స్‌లను సిద్ధం చేస్తున్నారు.

అల్ఫోర్స్‌లో 'మాథ్స్ మెజెస్టీ'

విద్యార్థుల ప్రదర్శనలను తిలకిస్తున్న అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ వీ నరేందర్ రెడ్డి

హౌసింగ్ బోర్డు కాలనీ, డిసెంబర్ 21 : కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ-టెక్నో స్కూల్‌లో ఏర్పాటు చేసిన 'మ్యాథ్స్ మెజెస్టీ' వేడుకలను అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత అధినేత డాక్టర్ వీ నరేందర్‌రెడ్డి ప్రారంభించారు. అంతకు ముందు శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీనివాస రామానుజన్ నేటి తరానికి గొప్ప మార్గదర్శకులని, నూతన అధ్యాయానికి నాంది పలికిన మహనీయుడని కొనియాడారు. ఉత్సవాలలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన మ్యాజిక్ మ్యాట్రిక్స్, రోబో సర్కిల్, క్యూబ్ బిల్డింగ్, పలు నమూనాలు ఆలోచింపచేశాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాష్ట్ర ప్రభుత్వ పరీక్షల విభాగం నిర్వహించనున్న లోయర్, హయ్యర్ డ్రాయింగ్, టైలరింగ్ (టీసీసీ) టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్ కోర్స్‌లకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాధికారి కార్యాలయం వెల్లడించినట్లు తెలంగాణ ఆర్ట్, ఫిజికల్, వర్క్, ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్(టీఏపీవేటా) జిల్లా అధ్యక్షుడు తాడూరి లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 29 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఉమ్మడి జిల్లా విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, పూర్తి వివరాలకు bsetelangana. gov. In ను సందర్శించాలని కోరారు.

రామగుండంలో విద్యుత్ కేంద్రం ఏర్పాటు చేయాలి

- అసెంబ్లీలో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

గోదావరిఖని, డిసెంబర్ 21: బొగ్గు, నీరు అన్ని వనరులు ఉన్న రామగుండంలో 800 మెగావాట్ల విద్యుత్ కేంద్రం ఏర్పాటు చేయాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ కోరారు. గురువారం అసెంబ్లీలో తొలిసారి మాట్లాడిన ఆయన మాంచెస్టర్ ఆఫ్ ఇండియాగా పిలువబడే రామగుండంలో విద్యుత్ కేంద్రం ఏర్పాటు చేయడానికి గతంలోనే నిర్ణయం జరిగిందని గుర్తుచేశారు. బీపీఎల్‌కు సంబంధించి 900 ఎకరాల భూమిని సేకరించారని చెప్పారు. రామగుండంలో విద్యుత్ కేంద్రం ఏర్పాటుతో ఉపాధి అవకాశాలు పెరుగుతాయని కోరారు.

'పారమిత'లో టాలెంట్ రివార్డు టెస్ట్

కార్పొరేషన్, డిసెంబర్ 21 : కరీంనగర్‌లోని పద్మనగర్‌లో ఉన్న పారమిత హెరిటేజ్ పాఠశాలలో ప్రస్తుతం రాష్ట్రంలోని పదో తరగతి విద్యార్థులకు ఈ నెల 24న ఆదివారం ఉదయం 10:00 నుంచి 12 గంటల వరకు పారమిత టాలెంట్ రివార్డు టెస్ట్ నిర్వహిస్తున్నట్లు పారమిత విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఈ ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల ప్రతిభను వెలికి తీసే ఉద్దేశంతో ఈ పరీక్ష నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ టెస్ట్ బహుళ ఐచ్ఛిక పద్ధతిలో ఉంటుందని, జేఈఈ విద్యార్థులకు మాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ 200 మార్కుల చొప్పున, నీట్ విద్యార్థులకు బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ 200 మార్కుల చొప్పున ఉంటాయన్నారు. ఈ పరీక్షలో అర్హత సాధించిన దాదాపు 20 శాతం విద్యార్థులకు 100% ఫీజులో రాయితీ ఇవ్వనున్నట్లు ప్రకటించారు. ఆసక్తి గల విద్యార్థులు https://forms.gle/hkLNsGలో రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 8106292424ను సంప్రదించాలని సూచించారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు ఉపయోగించుకోవాలన్నారు.